సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద సంస్థలో అన్నదానం



అన్నదానం చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్, ద్రోణంరాజు శ్రీవత్సవ్, మక్బూద్ అహ్మద్ తదితరులు

డాబాగార్డెన్స్: స్వామి వివేకానంద సీనియర్ సభ్యుడు దూడ రాజు రెండో వర్ధంతిని పురస్కరించుకుని గురువారం సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రాజు చిత్రపటానికి సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంఘ సేవకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, మక్బూద్ అహ్మద్, పలువురు సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానంద సంస్థకు చేసిన సేవలు గుర్తు చేసుకుని రాజు గొప్పదనం తెలిపారు. అనంతరం విద్యార్థులచే భగవద్గీత పారాయణం చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, దూడ రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ శిక్షణ



డీఎస్సీ శిక్షణకు హాజరైన అభ్యర్థులు

సీతంపేట: స్థానిక అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం డీఎస్సీ ఉచిత శిక్షణ ప్రారంభించారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్ హాజరై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు ఉచిత శిక్షణకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి రోజు సుమారు వంద మంది శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం వైస్ చైర్మన్ డి.అచ్చంనాయుడు, డైరెక్టర్ ఆర్.శంకర్, ఉపాధ్యక్షుడు ఎం.చంటి, సంయుక్త కార్యదర్శి బి.గౌతంబాబు,, ఫ్యాకల్టీ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు



టిఫిన్ సెంటర్ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

మద్దిలపాలెం: పాలిథిన్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చిరు వ్యాపారులను హెచ్చరించారు. జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.హరేంధిరప్రసాద్ ఆదేశాల మేరకు సీఎంవోహెచ్ నరేష్, జెడ్సీ శివప్రసాద్ సూచనలతో 16వ వార్డులో దుకాణదారులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై బుధవారం అవగాహన కల్పించారు. హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాల వరకు ఉన్న టిఫిన్ సెంటర్లు, దుకాణదారులకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, శుభ్రం సూపర్‌వైజర్, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించడంతో పాటు ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న వారికి జరిమానా కూడా విధించారు. జీవీఎంసీ అనుమతించిన కవర్లను మాత్రమే వాడాలని సూచించారు.

మధుర ఫలం.. అంతా గరళం



- మామిడి పండ్లను కృత్రిమంగా మగ్గిస్తున్న వ్యాపారులు
- పండు మగ్గక ముందే చక్కని రంగు కోసం చైనా ప్యాకెట్ కార్బైడ్ (కాల్షియం కార్బైడ్) వినియోగం
- తెలియక మోసపోతున్న వినియోగదారులు

జగదాంబ: వేసవిలో తియ్యగా పలకరించే మధుర ఫలం మామిడి. పండ్లలో రాజుగా పిలవబడే మామిడిని సీజన్‌లో అంతా పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తారు. మామిడి పండ్లు మే, జూన్ నెలల్లో సహజసిద్ధంగా మగ్గుతాయి. అటువంటి పండ్లనే తినాలి. ముందుగా వచ్చే పండ్లు అసహజ పద్ధతిలో మగ్గించి మార్కెట్‌లో విక్రయిస్తారు. అటువంటి వాటిని తిన కూడదని వైద్యులు కూడా చెబుతున్నారు. ఈ ఏడాది మామిడిలో ఆశించిన దిగుబడి రాలేదు. దీన్ని వ్యాపారులు ఆసరాగా చేసుకుని వినియోగదారుల జేబుకు చిల్లు పెడుతున్నారు. నాణ్యతతో కూడిన ఫలాలు ఆశించిన మేర బహిరంగ మార్కెట్లో లేవు. ఇటీవల వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా అకాల వర్షాలు, గాలులకు నేలరాలిన మామిడి పండ్లను సేకరించి వాటిపై ప్రమాదకర చైనా ప్యాకెట్ కార్బైడ్ (కాల్షియం కార్బైడ్) ఉపయోగించి కాయలను త్వరితగతిన పక్వానికి తీసుకొస్తున్నారు. ఈ రకమైన పండ్లు అనారోగ్య కారకాలు.

కృత్రిమంగా మగ్గబెడుతున్నారు..

వ్యాపారులు ముందుగా తోటల లెక్కన మామిడి పంటను కొనుగోలు చేస్తారు. తర్వాత టెంక ముదరక ముందే కోతలు కోయించి వాటిని ప్లాస్టిక్ క్రేట్లు, పేపర్లలో పెట్టించి మధ్యలో చైనా ప్యాకెట్ కార్బైడ్ (కాల్షియం కార్బైడ్) పెట్టి రాత్రంతా ఫ్యాన్ గాలి తగిలేటట్టు ఏర్పాటు చేస్తారు. మరుసటి రోజు తెరచి చూస్తే కాయ మొత్తం పసుపు రంగులోకి మారిపోతుంది. కానీ లోపలి వైపు కాయ మధ్యలో తెల్లగా ఉండి పుల్లని రుచి కలిగి ఉంటుంది. దీనిని గమనించని వినియోగదారులు వ్యాపారులు చెప్పినంత ధర చెల్లించి సరుకు కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా వ్యాధులకు గురవుతున్నారు.

కానరాని తనిఖీలు..

ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయకపోవడంతో వ్యాపారుల పంట మూడు పువ్వులు ఆరుకాయల్లా ఉంది. వాస్తవానికి పుచ్చకాయలు, బొప్పాయి, సపోటా పండ్లు, దానిమ్మ, యాపిల్, జామ, మామిడి వంటి అన్ని రకాల పండ్లు చైనా ప్యాకెట్ కార్బైడ్ (కాల్షియం కార్బైడ్)తో మగ్గించి విక్రయిస్తున్నారు. జిల్లా కేంద్రం అయిన విశాఖలోనే ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఉన్నప్పటికీ ఎలాంటి తనిఖీలు చేపట్టకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా విక్రయాలు చేస్తున్నారు.

మామిడి పండ్ల బుట్టలో పళ్ల మధ్య ప్రమాదకరమైన చైనా ప్యాకెట్ కార్బైడ్ (కాల్షియం కార్బైడ్)



ఆరోగ్యానికి హాని..

కార్బైడ్, ఇథలిన్‌తో మగ్గబెట్టిన మామిడి పండ్లను తినడం వల్ల అల్సర్, క్యాన్సర్ వంటి వ్యాధులు సోకుతాయి. అలాగే కాలేయం, మూత్రపిండాల వ్యాధులు వస్తాయి. కృత్రిమంగా మగ్గబెట్టే మామిడి పండ్లను ఎవరూ తినకూడదు. మే చివరిలో వచ్చే పండ్లు మాత్రమే సహజసిద్ధమైనవని గుర్తుంచుకోవాలి. అటువంటి వాటినే ఆరగించాలి.

– సందేష్, వైద్యాధికారి, ప్రసాద్‌గార్డెన్స్ ఆరోగ్య కేంద్రం

స్వచ్ఛమైన పండ్లను ఇలా గుర్తించొచ్చు..

- పసుపు, లేత ఆకుపచ్చ రంగు కలిగి లోపల పండు మొత్తం పరిపక్వంగా ఉంటుంది
- పండు మెత్తగా ఉండి, ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. తగినంత చక్కెర శాతం ఉంటుంది
- తియ్యగా, రుచిగా ఉండడంతో పాటు వాసన గుబాళిస్తుంది.

కార్బైడ్, ఇథలిన్‌తో మగ్గించిన పండ్లు ఇలా ఉంటాయి..

- పండు మొత్తం కాంతివంతమైన లేత పసుపు రంగు కలిగి ఉంటుంది
- పైకి మగ్గినట్లు కనిపించినా లోపల అపరిపక్వంగా, పుల్లగా ఉంటుంది.
- పండు తొక్క ముడతలు లేకుండా గట్టిగా ఉంటుంది. పండ్లు త్వరగా పాడైపోతాయి.
- తొక్కపై నల్లని మచ్చలు ఏర్పడతాయి.



మామిడి పండ్లు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



చైనా ప్యాకెట్ కార్బైడ్ (కాల్షియం కార్బైడ్) ఉపయోగించి ఒక గదిలో మామిడి పండ్లను మగ్గిస్తున్న దృశ్యం

పాక్‌పై భారత్ విజయానికి పూజలు



పురాతన ఎల్లమ్మ అమ్మవారి గద్దె వద్ద నివాళులు అర్పిస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం: గత కొన్ని రోజులుగా భారత్–పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో భారత్ విజయం సాధించటంతో జీవీఎంసీ 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము గురువారం పూజలు నిర్వహించారు. అమ్మవారి వీధిలో గల పురాతన ఎల్లమ్మ పుట్ట వద్ద 500 కొబ్బరికాయలు కొట్టి తన దేశభక్తి చాటుకున్నాడు. జాతీయ జెండాతో అమ్మవారి గద్దె వద్ద అమరులైన సైనికులకు నివాళులు అర్పించారు. అదే విధంగా రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీ గెలవాలని కోరుకున్నట్లు అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెలో అంతా పాల్గొనాలి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నేతలు

కంచరపాలెం: కార్మికుల హక్కులను కాల రాసే విధంగా కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్లు ఉన్నాయని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు ధ్వజమెత్తారు. జ్ఞానాపురం జేఎస్ఎస్‌యూ ఆర్‌ఎం కాలనీలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె, గ్రామీణ హర్తాళ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చాయని, అన్ని వర్గాల కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఈ సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీలు విడుదల చేసిన గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరావు, జయమ్మ, ఈసరపు లక్ష్మి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 జ్ఞానాపురం పరిధి జోనల్ కార్యాలయంలో మలేరియా విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధుల నివారణపై గురువారం మలేరియా ఇన్‌స్పెక్టర్ నల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ విధుల్లో సమయపాలన పాటించాలని, తమ వార్డుల్లో ఉన్న ప్రజలతో మాట్లాడి సీజనల్ వ్యాధుల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించాలని తెలిపారు. యాంటీ లార్వా ఆపరేషన్‌ను పక్కాగా నిర్వహించాలని, ఇళ్లలో వాటర్ కంటైనర్లతో పాటు నీటి నిల్వలను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధులు కలగజేసే దోమలను నిర్మూలించాలని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ (ఎస్ఎస్) జనార్దన్, మలేరియా సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఆయుర్వేద వైద్య శిబిరం



డాక్టర్ కె.ఎం.ఉన్నికృష్ణన్

మహారాణిపేట: ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈనెల 17 నుంచి 21 వరకు కేరళకు చెందిన ప్రసిద్ధ వైద్యులచే ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు కేరళ ఆయుర్వేద కేంద్రం వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ ఐదు రోజుల పాటు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. హైపర్ టెన్షన్ (ఆందోళన), ఆర్థరైటిస్ (కీళ్లవ్యాధులు), పక్షవాతం, నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసిక వత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. 17,18,19 తేదీల్లో మురళీనగర్‌లోనూ, 20, 21 తేదీల్లో రామ్‌నగర్‌లో డాక్టర్ అందుబాటులో వుంటారన్నారు. అపాయింట్మెంట్ కోసం రామ్‌నగర్‌లోని జీవీఎంసీ గేటు ఎదురు లైన్‌లో లేదా మురళీనగర్ శ్రీదేవి పార్క్ వద్ద గల తమ కేంద్రాల్లో సంప్రదించవచ్చన్నారు. 8008000670 నంబర్‌లో అందుబాటులో ఉంటారని తెలిపారు.

కళాకారులను ప్రోత్సహించాలి



కళాకారిణి రత్నశ్రీని సత్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, కార్పొరేటర్ ముత్యాలు

అగనంపూడి: కళాకారులకు గుర్తింపునివ్వడంతోపాటు వారిని ప్రోత్సహించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు అన్నారు. 88వ వార్డు వెదుళ్లనరవ ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా కడప సత్యసాయి కళామండలి ఆధ్వర్యంలో భక్త చింతామణి నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా చింతామణి పాత్రధారిణి సువర్ణకు అష్టకంకణం కందుకూరి పురస్కారం, మహానటి సావిత్రి బిరుదాంకితురాలు జి. రత్నశ్రీని ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, పౌరాణిక నాటకాలు, కళాకారులు కనుమరుగయ్యే పరిస్థితి ఉందని, వారిని ఆదుకోవడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కళాకారిణి రత్నశ్రీ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా వివిధ రాష్ట్రాల్లో మూడు వేలకు పైగా నాటకాలు ప్రదర్శించానని, చింతామణి, సత్యభామ, చంద్రమతి పాత్రల్లో నటించడంతోపాటు కొన్ని సినిమాల్లో కూడా నటించానని తెలిపారు. కళాకారులను ఈ విధంగా గుర్తించి సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్వసిద్ధి బొరయ్యనాయుడు, విందుల వరహాలు, బలిరెడ్డి సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, సారిపల్లి అప్పాజీరావు, పోలారావు, సీతయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



కబడ్డీ ఆడుతున్న చిన్నారులు

పెదగంట్యాడ: నీతి కథలు జీవితాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి తోడ్పడతాయని, చదువుతో పాటు క్రీడల్లో కూడా ఆసక్తి చూపాలని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో గురువారం చిన్నారులతో గ్రంథ పఠనం చేయించారు. అలాగే వారికి కథలు చెప్పారు. కబడ్డీ ఆడించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

నియోజకవర్గాల పున:రూపకల్పనకు ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: నియోజకవర్గాల పున:రూపకల్పనకు జీవీఎంసీ జోన్–4 సూర్యాబాగ్ కార్యాలయంలో అభిప్రాయ సేకరణ జరిగింది. జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గంలో ఉన్న వార్డులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు ప్రజా ప్రతినిధులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయాలు తెలిపారు. దక్షిణలో 28 నుంచి 39 వరకు వార్డులు ఉన్నాయి. వీటిలో 28వ వార్డు సగభాగం ఈస్ట్ నియోజకవర్గంలో ఉండడంతో అభివృద్ధికి దూరం అవుతోంది. అలాగే ప్రజా ప్రతినిధుల సమావేశాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని 28వ వార్డు పూర్తిగా ఈస్ట్‌లోనే ఉండేందుకు వార్డు నాయకులు, ప్రజాసంఘాలు ప్రతినిధులు, మేధావులు సమ్మతం తెలిపారు. అలాగే 27, 41, 42 వార్డుల్లో కూడా కొంత మేర ఉత్తర నియోజకవర్గంలో ఉండడంతో దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో ప్రజాభిప్రాయ సేకరణలో తేలనుందని జెడ్సీ తెలిపారు. తదుపరి నివేదిక ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

ఆకట్టుకున్న కాంతారా వేషధారణ



దేవతామూర్తుల వేషధారణతో ఆకట్టుకున్న కళాకారులు

అక్కిరెడ్డిపాలెం: పాతకర్ణవానిపాలెంలో ఆరాధ్య దేవతలు శ్రీ దుర్గమాంబ, పైడిమాంబ జాతర గురువారం అంబరాన్ని అంటింది. గ్రామ రామాలయం వద్ద జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన కళాకారులు ప్రదర్శించిన 'కాంతారా–2' సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కాళీమాత, కాంతారా, సీతారాముల వేషధారణలు చూపరులను కట్టిపడేశాయి. వారి నృత్య ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు ప్రేక్షకులను అలరించాయి. మన సంస్కృతి సంప్రదాయాలను ఇలాంటి పండుగల సమయంలో ప్రదర్శించడం గొప్ప విషయమని కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. ఈ సందర్భంగా కళాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సిరసపల్లి అప్పారావు, గుటూరు శంకర్రావు, బొండా ఎల్లాజీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో ఎర్నిమాంబ ఆలయాన్ని విస్తరిస్తాం

నీలధార యాత్రలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



పట్టువస్త్రాలతో వాసుపల్లి, నీళ్ల బిందెలతో కార్పొరేటర్ పూర్ణిమ, మహిళలు



ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న వాసుపల్లి, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కంచరపాలెం: జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారి జాతరలో భాగంగా జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన నీలధార యాత్రలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్ఞానాపురం గ్రామం నుండి ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం వరకు భారీగా స్థానిక మహిళలతో పసుపునీళ్ల బిందెలు పట్టుకుని జరిగిన యాత్రలో వాసుపల్లి గణేష్‌కుమార్ పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమ తలపై పెట్టుకుని ఆలయానికి యాత్రగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కోడిగుడ్ల పూర్ణిమ, తోట పద్మావతి, కోరుకొండ వెంకట స్వాతిదాస్, రెయ్యి వెంకటరమణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాసుపల్లి మీడియాతో మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ ఎంతగానో కృషి చేశారన్నారు. మళ్లీ ప్రజల ఆశీస్సులతో రానున్న జగన్ ప్రభుత్వంలో పంటల తల్లి, సంతాన దేవతగా ప్రసిద్ధిగాంచిన ఇక్కడి ఎర్నిమాంబ అమ్మవారి ఆలయాన్ని అమ్మవారి పాదాల సాక్షిగా మరింత విస్తరించే విధంగా కృషి చేస్తానని వాసుపల్లి తెలిపారు. వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ మాట్లాడుతూ గతంలో ఇక్కడి ఆలయాన్ని తొలగించే ప్రక్రియలో వాసుపల్లి అడ్డుకుని ఆలయ అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధిని అడ్డుకునే పనిలో కూటమి ప్రభుత్వం కుతంత్ర రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే స్థానిక అమ్మవారి ఆలయంలో శాశ్వత షెడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆలయ చైర్మన్ లండ రమణ, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు వేళంగిణిరావు, ఎల్. కుమార్, సాయి, మురళి, కిషోర్, అప్పారావు, పరీష్, అర్జున్, భవానీ, ఐ.రవి, ప్రసన్న, శ్యామ్‌బాబ్జీ, చిన్నిప్రసాద్, రామరాజు, చింతకాయల వాసు పాల్గొన్నారు.

గడువు పొడిగిస్తారా?

- గడువు ముగియకుండానే వెబ్‌సైట్ బంద్
- జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారుల మాయాజాలం
- కూటమి సర్కారుపై లబ్ధిదారుల ఆగ్రహం



ఎస్సీ రుణాల కోసం రూపొందించిన ప్రభుత్వ వెబ్‌సైట్

ఎంవీపీకాలనీ: షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) కార్పొరేషన్ ద్వారా అందించే ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకునే ప్రక్రియలో లబ్ధిదారులకు తీవ్ర నిరాశ ఎదురైంది. దరఖాస్తు గడువు 10వ తేదీ అని ముందుగా ప్రకటించగా.. అధికారిక వెబ్‌సైట్ 8వ తేదీ నుంచే పనిచేయడం మానేసింది. దీంతో అర్హులైన అనేకమంది దరఖాస్తు చేసుకోలేకపోయారు. ఈ సమస్యపై జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెబ్‌సైట్‌ను తక్షణమే పునరుద్ధరించి.. దరఖాస్తు గడువును పొడిగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వందలాది మందికి నష్టం

సబ్సిడీ రుణాల కోసం ఆశగా ఎదురుచూస్తున్న వందలాది మంది లబ్ధిదారులకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ చర్యలు తీవ్ర నిరాశకు గురిచేశాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.16.88 కోట్ల బడ్జెట్‌తో 32 రకాల రుణాలను అందించాలని కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వం విశాఖ జిల్లాకు ఈ ఏడాది 406 యూనిట్లు కేటాయించింది. 21 నుంచి 50 సంవత్సరాల వయసు గల అర్హులైన అభ్యర్థులు https:// apobmms. apcfss. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అయితే, దరఖాస్తు గడువు ముగియడానికి రెండు రోజులు ఉందనగా.. 8వ తేదీ నుంచే వెబ్‌సైట్ పనిచేయడం మానేసింది. చివరి రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకుందామనుకున్న వారికి తీవ్ర నిరాశ ఎదురైంది. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు వంటి అవసరమైన అన్ని పత్రాలతో సిద్ధంగా ఉన్నప్పటికీ.. సాంకేతిక సమస్యల కారణంగా వారు దరఖాస్తు చేసుకోలేకపోయారు. ముఖ్యంగా ట్రాన్స్‌పోర్ట్ వాహనాల రుణాల కోసం డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్నవారు సైతం ఈ అవకాశాన్ని కోల్పోయారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సత్యపద్మను సంప్రదించడానికి ప్రయత్నించగా.. ఆమె అందుబాటులోకి రాలేదని లబ్ధిదారులు తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమా?

ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు పెంపుపై ఇప్పటికీ ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వెబ్‌సైట్ సమస్య కారణంగా దరఖాస్తు చేసుకోలేకపోయిన వారికి గడువు పొడుగిస్తామని కార్పొరేషన్ సిబ్బంది హామీ ఇచ్చినప్పటికీ.. ఐదు రోజులు గడిచినా అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. కీలకమైన చివరి రెండు రోజుల్లో వెబ్‌సైట్ నిలిచిపోవడం పట్ల లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది కూటమి ప్రభుత్వ ఉద్దేశపూర్వక చర్యేనని, కావాలనే ఆన్‌లైన్ ప్రక్రియను నిలిపివేశారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.